# ప్రథమ కర్తవ్యం

భారతమ్మ వీధిలో చాలా సేపటి నుండి ఎదురు చూస్తూ నిల్చుంది. ఆ టైముకు పోస్టుమ్యాను రావాలి. కాని ఆరోజు ఆలశ్యం అయినట్లుంది. ఆమె చాలా అసహనంగా ఉంది. అతి ముఖ్యమైన ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నది. అదీ తన ముద్దుల కొడుకు చిరంజీవి నుండి రావాలి.

దూరంగా పోస్ట్‌మ్యాన్ రామయ్య కనిపించాడు. అమెను మోయలేని భారాన్ని మోస్తూ వస్తున్నట్లు, వంగిపోయి నిదానంగా వస్తున్నాడు. ఆ పాటి ఆలశ్యాన్ని కూడా భరించలేక పోతున్నది.

" రామయ్య – ఏదీ నాకవరు?" ఆత్రంగా అడిగింది.

పోస్టుమ్యాను రామయ్య ఉత్తర్రాల కట్టను పరిశీలించాడు పెదవి విరిచాడు. "మీకు రాలేదమ్మా"!

" రాకుండా ఎలా ఉంటుంది. ఓ సారి సరిగా చూడు " నిరాశపడ్తూ అడిగింది.

" మీ ఉత్తరం అనగానే ముందే తీసి పెడతాను. మీ ఆతృత నాకు తెల్సుగా" నవ్వుతూ వెళ్ళిపోయాడు.

ప్చ్ ! నిట్టూర్చుకుంటూ లోపలికి వచ్చింది భారతమ్మ.

" ఏమ్మా ! అన్నయ్యనుండి ఉత్తరం రాలేదా?" ఆమె కూతురు సుగుణ అడిగింది.

" ఊహూ ! రాలేదు. మరి వాడు రాయలేదో ఈ పోస్టులో మిస్సయిందో!"

" ఏమో ! మరి నా కాలేజి ఫీజు ఎలా? రేపే ఆఖరి రోజు డబ్బు కట్టడానికి" సుగుణ ఆందోళనగా అంది.

" ఆ సంగతి మీ అన్నయ్యకు తెల్సుగా – "

" ఆ ! నేను ఉత్తరం రాసి పదిరోజులైంది..."

" దూరాభారం ! ఎక్కడ ఏ ప్రమాదాలొచ్చినా వేళకు రైళ్ళు – బస్సులు రావు – చూద్దాం!".

" నాన్న బ్రతికుంటే నాకీ తిప్పలుండేవి కావు" సుగుణ అంది.

భారతమ్మకు భర్త గుర్తుకొచ్చి కన్నీళ్ళు తిరగాయి. ప్రతాప్ – భారతి కల్సి ఐదేళ్ళు కాపురం చేసి ఉంటారు. అంతే ! ప్రతాప్ మిలిటరీలో పనిచేసేవాడు. వాలంటరీ రిటైర్‌మెంట్‌లో పనిచేసేవాడు. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుని సంతోషంగా కుటుంబ జీవితం గడుపుదామనుకున్నంతలో యుద్ధం వచ్చింది. ఆ యుద్ధంలో వీరమరణం పొందాడు.

అప్పటికి చిరంజీవికి మూడేళ్ల వయసు... సుగుణ కడుపులో ఉంది. భారతికి మూడేళ్ళు కూడా లేవు. నిండు యవ్వనంలో భర్తను పోగొట్టుకుని – పిల్లల బాధ్యత నెత్తిన అతి భారంగా జీవితాన్ని గడిపింది. తను ఎన్ని కష్టాలు పడ్డా పిల్లల విషయంలో ఎటువంటి

లోటూ రానివ్వలేదు. ప్రతాప్ మరణించగా వచ్చిన దబ్బుల్ని జాగ్రత్త పరచి... పిల్లలను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దింది.

★★★★★

ఆ రోజు చిరంజీవి ఆర్మీలో చేరతాను అన్నప్పుడు ఆమె గుండె జల్లుమంది. పట్టుమని ఇరవై కూడా నిండలేదు– ఆర్మీలో చేరతానని పట్టుపట్టాడు.

" బాబూ ! మీ నాన్నను పోగొట్టుకుని జీవితంలో ఎంతో నష్టపోయాను. నా ఆశలన్నీ నీ మీదే ఉంచుకుని బ్రతుకుతున్నాను. నువ్వు – సుగుణ నాకు రెండు కళ్ళు. వంశాన్ని ఉద్ధరించాల్సిన వాడివి – నువ్వు పోయి ఆర్మీలో చేరితే మా బ్రతుకులేమవుతాయి?" భారతి దీనంగా వేడుకుంది.

" ఆర్మీలో చేరినంత మాత్రాన నా బాధ్యత విస్మరిస్తానా? నా ట్రైనింగ్ పూర్తయి, పర్మనెంట్ పోస్టింగ్ ఇచ్చిన తరువాత మీ ఇద్దరినీ కూడా తీసుకుపోతాను. వచ్చిన జీతం దాచి సుగుణకు పెళ్ళి చేస్తాను" చెప్పాడు చిరంజీవి.

" కాదనను కాని... ఆర్మీ ఎందుకు–దేశంలో–ఎన్నో ఉద్యోగాలున్నాయి. కడుపులో చల్లకదలకుండా–ఫ్యానుకింద కూర్చుని– పెద్ద కష్టపడకుండా – ఎక్కువ డబ్బులు సంపాదించే ఉద్యోగాలు చాలా ఉన్నాయి. డిగ్రీ ఫస్టుక్లాసులో పాసయ్యావు. నీకు మంచి ఉద్యోగమే వస్తుంది. రిస్కూ ఉండదు – మా కళ్ళ ఎదుట ఉంటావు." భారతమ్మ చెప్పింది.

" కాని నాకు ఆత్మతృప్తి కావాలి. జాబ్ శాటిస్‌ఫాక్షన్ కావాలి. దేశ రక్షణలో నా కర్తవ్యాన్ని నిర్వహిస్తే నాకు కలిగే తృప్తి వేరు – నాన్నలా వీరజవానునై నా జన్మభూమి రుణం తీర్చుకుంటాను." చిరంజీవి చెప్పాడు.

ఇంక ఉండబట్టలేక భారతమ్మ భోరున ఏడ్చింది. " నీ విధి నిర్వహణలో నీకేమన్నా అయితే మా గతేంటి నిన్ను పోగొట్టుకుని మేం బ్రతకగలమా? యుద్ధం వస్తే ప్రాణాలతో తిరిగి వస్తావని ఎలా అనుకోం?"

" అమ్మా భయపడద్దు పిరికివాడు రోజూ మరణిస్తాడు కాని వీరుడు ఒక్కసారే మరణిస్తాడు. చావు రాసిపెట్టి ఉంటే ఏ ఉద్యోగం చేస్తున్నా వస్తుంది. నా దేశం కోసం పోరాడుతూ, శత్రువులను చీల్చి చెండాడుతూ, వీరమరణం పొందడం వేరు. మా అమ్మ వీరమాత ! నాకు పిరికి మందు పోయదని నేను అనుకుంటున్నాను" తన దృఢనిశ్చయం చెప్పాడు.

ఆ విషయంలో భారతమ్మకు – చిరంజీవికి మధ్య వాగ్వివాదం కొన్ని రోజులు జరిగింది. పంతాలు–పట్టింపులు– అలకలు అన్నీ జరిగాయి.

చుట్టు పక్కల వాళ్ళు కూడా జోక్యం చేసుకున్నారు చివరికి భారతమ్మ తన పంతం వదలి పెట్టక తప్పలేదు. సుగుణ కాలేజీ చదువుకోసం ఆ ఊళ్ళోనే ఉండి పోవలసి

వచ్చింది.

★★★★★

చిరంజీవి మిలిటరీలో చేరి ఐదేళ్ళు కావస్తున్నది. సెలవులకు ఇంటికి వచ్చి సరదాగా గడిపి పోతూండేవాడు. భారతమ్మ అతనికి ఎన్నో సంబంధాలు చూసింది. కాని చెల్లెలి పెళ్ళి కాంది తను చేసుకోననేవాడు.

సుగుణకు పెళ్ళి చేద్దామంటే తన పిజీ పూర్తికావాలనేది... ఇలా సంబంధాలు రావడం –పోవడం జరుగుతున్నది. ఈ ఏడుతో సుగుణ చదువు పూర్తవుతుంది.

ఇద్దరికీ ఒకేసారి పెళ్ళి చేస్తే తన బాధ్యత తీరిపోతుందని భారతమ్మ ఆశ !

ఆ శుభముహూర్తం కోసం ఎదురు చూస్తున్నది.

" టెలిగ్రాం !" పిలుపుతో ఆలోచనల్లోంచి బయటపడింది.

" భారతమ్మ మీరేనా?"

గుమ్మంలో అగంతకుడు అడుగుతున్నాడు.

" ఆ ! నేనే !"

" మీకు టెలిగ్రాం ఉంది. సంతకం పెట్టి తీసుకోండి."

భారతమ్మ గాభరాపడుతూ "సుగుణ" ను కేక వేసింది వణుకుతున్న చేతులతో సంతకం పెట్టి తీసుకుంది.

" అమ్మా ! సుగుణ – టెలిగ్రాం చదువు !"

" చిరంజీవి ... సీరియస్... అమ్మా ! అన్నయ్యకు సీరియస్‌గా ఉందిట !" సుగుణ ఏడుస్తూ చెప్పింది.

" ఎవరిచ్చారు ఆ టెలిగ్రాం!"

" ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ నుండి వచ్చింది.." సుగుణ చెప్పింది.

భారతమ్మ కళ్ళ వెంబడ కన్నీరు ధారాపతంగా కారుతున్నది.

భారత సరిహద్దుల్లోకి అక్రమంగా ప్రవేశించిన చొరబాటు దారులను ఏరివేసే కార్గిల్ సైనిక చర్యలో చిరంజీవి పాల్గొంటున్నట్లు ఓ వారం క్రిందట వార్త తెల్సింది.

అప్పటి నుండి ఎంతో మంది దేవుళ్ళను తన బిడ్డను కాపాడమని మొక్కుకుంటూనే ఉంది.

కార్గిల్ గురించి మొదట్లో అంత సీరియస్‌గా తీసుకోకపోయినా – రోజు రోజుకు వస్తున్న వార్తలు ఆమెను ఆందోళనలో పడవేస్తున్నాయి.

సుగుణ టీవీ ఆన్ చేసింది. వార్తల్లో కార్గిల్ యుద్ధరంగం గురించి చెబుతున్నాడు. ఇప్పటి దాకా రెండువందల మూడుమంది జవాన్లు మరణించారు అని చెప్పాడు.

ఆ మరణించిన వారిలో తన కొడుకు ఉండకూడదని దేవుళ్ళకు మొక్కుకుంది.

సుగుణ గంభీరంగా మారిపోయింది. ఆమె చిన్న పిల్లకాదు అర్థం చేసుకోక పోవడానికి వారి మధ్య పేరుకున్న నిశ్శబ్దాన్ని చీలుస్తూ " కోరియర్" అన్న కేక వినిపించింది.

సుగుణ కొరియర్‌లో వచ్చిన పార్సిలు అందుకుంది ఆత్రంగా విప్పింది.

" భగవద్గీత" పుస్తకం మహాభారత గ్రంథం! రామాయణ పుస్తకం!

ఆ పుస్తకాల్లోంచి ఓ లెటరు డిమాండు డ్రాఫ్టు బయటపడింది.

సుగుణ ఉత్తరాన్ని పైకి చదివింది.

" అమ్మా ! ఈ ఉత్తరం నీకు చేరే సరికి నీ పిలుపు అందనంత దూరాలకు వెళ్ళిపోతున్నాను.

కార్గిల్ యుద్ధరంగానికి నన్ను పంపించడం నా అదృష్టంగా భావిస్తున్నాను ఇన్నాళ్లికి నా మాతృభూమి రక్షణ కోసం తుపాకీ పట్టే అవకాశం లభించింది. మా లక్ష్యం ఒక్కటే ! శత్రువులను టెర్రరిస్టులను తరిమికొట్టడం ! భారత భూభాగాన్ని ఆక్రమించిన అక్రమ చొరబాటు దుండగులను హతం చేయడం !

ఆ లక్ష్య సిద్ధికి మేము ఎన్ని కష్టాలనైనా భరిస్తాం! మంచుకొండల్లో పాక్కుంటూ వెళతాం. నిలువెత్తు శిఖరాలను అధిరోహిస్తాం! శతఘ్నుల దాడికి తుపాకీ గుండ్లకు వెన్నుచూపం !

ఈ యుద్ధంలో పాల్గొంటూ నాకున్న కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నందుకు గర్విస్తున్నాను. మాలో కొందరి ప్రాణాలు గాల్లో కలిసిపోవచ్చు. క్షతగాత్రులు కావచ్చు. శత్రువుల చేతుల్లో చిక్కి చిత్రహింసలు అనుభవించవచ్చు. కాని ఇవన్నీ మాతృభూమి కోసం – దేశ రక్షణ కోసం చిరునవ్వుతో స్వీకరిస్తాం! భరత ప్రజలకు మళ్ళీ బానిసత్వం కలుగనివ్వం. ప్రపంచ దేశాలలో మన మువ్వన్నెల జెండాను గర్వంగా నిలబెడతాం!

అమ్మా ! దీనివెంట ఇరువై అయిదువేలకు డి.డి. పంపుతున్నా. ఇదీ నా దగ్గరున్న డబ్బు ! దీంతో చెల్లెలు చదువు పూర్తి చేయించు. ఆమె పెళ్ళికోసం నెలనెల నాను దాస్తున్న డబ్బు తాలూకు పాసుబుక్కులు – నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు పంపుతున్నాను. సుగుణకు ఘనంగా పెళ్ళి చెయ్యి. అన్నగా నా బాధ్యత నెరవేరుతుంది.

ఒకవేళ నాకేమన్నా జరిగితే ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతో – పెన్షన్‌తో నీ జీవితం సుఖంగా వెళ్ళిపోతుంది. నేను వీరమరణం పొందితే నా కోసం కన్నీరు కార్చొద్దు! నువ్వు వీరమాతవు! దేశానికి నా సర్వస్వాన్ని అర్పించినందుకు గర్వపడు.

నేను పంపుతున్న ఆధ్యాత్మిక గ్రంథాలతో మనసు కుదుట పరుచుకో... చెల్లి సుగుణకు ఆశీస్సులు– తల్లీ నీకు నా పాదాభివందనం– జన్మభూమి పిలుస్తున్నది.... సెలవు... ఇట్లు నీ భరతపుత్రుడు చిరంజీవి.

సుగుణ వెక్కిళ్ళు పెడుతున్నది.... భారతమ్మకు దుఃఖం ఆగడం లేదు. అతను రాసిన

ఉత్తరాన్ని ముద్దు పెట్టుకుంది. సుగుణ గోడకున్న చిరంజీవి ఫోటోను తీసి కౌగిలించుకుంది 'అన్నయ్య !' అంటూ ఏడుస్తూ.

★★★★★

కాలం చాలా భారంగా గడుస్తున్నది. తల్లి కూతుళ్ళు ఒకళ్ళని ఒకళ్ళు ఓదార్చుకుంటున్నారు. దేవుడిని తలచుకుని ధైర్యం తెచ్చుకుంటున్నారు.

ఆ రాత్రి టీవీలో వార్తల్లో యుద్ధంలో మరణించిన వీర జవానుల పేర్లు చెబుతున్నారు.

' చిరంజీవి' అన్న పేరు వినగానే భారతమ్మ 'బాబూ!' అంటూ స్పృహ తప్పి పడిపోయింది.

సుగుణ తన చెవుల్ని నమ్మలేక పోతున్నది తల్లికి ఉపచారాలు చేయడం, మొదలు పెట్టింది.

ఓ ఐదునిమిషాల్లో ఇరుగుపొరుగు... ఆ వీధి జనం ఆ ఇంటి ముందు చేరి పోయారు. యుద్ధంలో మరణించిన వీరజవానుకు నివాళులర్పించారు. సుగుణకు ధైర్యం చెప్పారు.

" ముందు అమ్మ పరిస్థితి బాగోలేదు. వెంటనే హాస్పిటల్లో చేర్చాలి!" చెప్పింది వాళ్ళను ఉద్దేశించి.

" ఫర్వాలేదు... నా కారు తెస్తాను... తీసుకుపోదాం..." ఆ వీధిలోని ఓ పెద్ద మనిషి చెప్పాడు.

భారతమ్మను హాస్పిటల్లో చేర్పించి... ఎమర్జెన్సీ ట్రీట్‌మెంట్ ఇవ్వసాగారు డాక్టర్లు. తెలిసిన వారందరూ ఆమెను చూడటానికి వస్తున్నారు.

రెండు రోజుల తర్వాత భారతమ్మకు స్పృహ వచ్చింది. ఇంతలో... ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ నుండి మెసేజ్ వచ్చింది. చిరంజీవి ధైర్యసాహసాలకు మెచ్చి బిరుదు ఇమ్మని సిఫార్సు చేసినట్లు... రాజలాంఛనాలతో అతని భౌతిక కాయాన్ని తీసుకువస్తున్నట్లు వార్త వచ్చింది.

రైల్వే స్టేషనుకు ఊరు ఊరంతా తరలి వచ్చి చిరంజీవి భౌతిక కాయాన్ని ఊరేగింపుగా అతని ఇంటికి తీసుకు వచ్చారు. అతని అంత్యక్రియలకు హాజరవుతున్న ప్రభుత్వ ప్రతినిధులు-ఆ ఊరి ఎమ్మెల్యే, హాస్పిటల్లో ఉన్న భారతమ్మను చూడ్డానికి వచ్చారు.

ఆమె ఆరోగ్యం గురించి పరామర్శించారు.

ఆమె కన్నీళ్ళను మింగింది.

" ముఖ్యమంత్రిగారు ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు." చెప్పాడు ఎమ్మెల్యే.

శుష్క మందాహాసం చేసింది భారతమ్మ.

" మీ కుటుంబ సభ్యులకు ఒకరికి ఉద్యోగం ఇస్తుంది ప్రభుత్వం." మిలిటరీ అధికారి చెప్పాడు.

భారతమ్మ చేతులు జోడించి నమస్కరించింది.

" దయుంచి - నాకు ఓ అవకాశం ఇవ్వండి... ఆ శత్రువులతో - ఆ దుండగులతో పోరాడతాను." భారతమ్మ చెప్పింది.

అందరూ అవాక్కులై పోయారు.

" నా భర్త యుద్ధంలో వీరమరణం పొందాడు. నా కొడుకు యుద్ధంలో వీరమరణం పొందాడు. దేశాన్ని రక్షించే ఆ పవిత్ర కర్తవ్యం నాకూ ఇస్తే నేను వీరమరణం పొందుతాను." ఆవేశంగా అంది.

" అమ్మా ! ఆవేశపడకు ... అన్నయ్యను - కాదు అతని శరీరాన్ని తీసుకు వచ్చారు... టైమవుతున్నది.. అంత్యక్రియలు ఏర్పాటు చెయ్యాలి" సుగుణ చెప్పింది.

" నో ! నా చిరంజీవి మరణించలేదు." భారతమ్మ చెప్పింది.

" చిరంజీవి అమర్ హై !" అందరూ నినాదాలిచ్చారు.

" మీ చిరంజీవి స్ఫూర్తితో ఈ ఊరి నుండి చాలా మంది యువకులు సైన్యంలో చేరడానికి రెడీగా ఉన్నారు." చెప్పాడు ఎమ్మెల్యే.

" సార్ ! అబలనని సందేహించకండి... నాకు దేశరక్షణలో ఏదైనా ఉద్యోగం ఇప్పించండి." సుగుణ మిలిటరీ అధికారిని అడిగింది.

" అలాగే - తప్పకుండా చూస్తాం- కాని అందుకు మీ అమ్మగారి పర్మిషన్ కావాలి- ఇప్పటికే ఆమె ఇద్దరిని... పొగొట్టుకుంది" మెల్లగా చెప్పాడు మిలిటరి అధికారి.

" నా అనుమతి ఆమెకి ఉంది. మా కుటుంబం ఏమైనా ఫర్వాలేదు. దేశానికి ముప్పు రాకూడదు. ఈ దేశంలో పుట్టాం. ఈ దేశం కోసం మా రక్తం చిందిస్తాం" భారతమ్మ చెప్పింది. కారబోతున్న కన్నీటిని ఆపుకుంటూ.

" హియర్ హియర్ !" అంటూ అందరూ చప్పట్లు కొట్టారు.

" అమ్మా ! అంతా నీలాగా ఉంటే మన దేశానికి ఇన్ని కష్టాలు వచ్చి ఉండేవి కావు" మిలిటరీ అధికారి చెప్పాడు.

అమ్మా ! భారతమ్మా !మన ఊరికే కాదు, మన రాష్ట్రానికే కాదు మన దేశానికి నువ్వు ఆదర్శవనితవమ్మా !" ఎమ్మెల్యే అభినందించాడు.

" అమ్మా ! అన్నయ్యను సాగనంపుదాం- రామ్మా !" సుగుణ ఏడుస్తూ అన్నది.

" సుగుణ ! మీ అన్నయ్య ఇప్పుడు మనిద్దరి వాడే కాదమ్మా ! ఈ దేశానికి అందరికి కావలసినవాడు- పద! అతన్ని ఆదర్శంగా తీసుకుని ఈ దేశాన్ని ముందుకు నడిపిద్దాం!" ముందుకు నడుస్తూ కన్నీళ్ళు తుడుచుకుంది భారతమ్మ.

- తేజ అక్టోబర్ 6, 2006